ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -141 పేజీలు - 04 వెల - 04/- ఆదివారం 28 జూన్ 2026

# నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

## వెలిగొండ నిర్వాసిత రైతులతో సిఎం చంద్రబాబు భేటీ

**నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ**


**భూములు ఇచ్చిన రైతులు త్యాగం మరువలేనిది**

**తొలివిడతలో నిర్వాసితులకు 300 కోట్ల పరిహారం**

**కృష్ణాజలాలు వస్తాయని ఎవ్వరూ ఊహించలేదు**

**గత ప్రభుత్వ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం**

**వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు**



**మార్కాపురం,జూన్ 27ఆంధ్ర ప్రగతి** నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలిగొండ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు వృథా కావని చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించిన అనంతరం నిర్వాసితులు, లబ్దిదారులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శనివారం దోర్నాల మండలం గంటావానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు, రైతులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. నీళ్లు లేక చాలా మంది ఫ్లోరైడ్ వాటర్ తాగుతున్నారని.. కృష్ణా నదీ జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఎవరూ ఆలోచన చేసి ఉండరని తెలిపారు. రాయలసీమ, మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకురావాలని ఎన్టీఆర్ ఆలోచన చేశారని గుర్తుచేశారు. 1996 మార్చి 26న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించామని.. రూ. 900 కోట్లు పునరావాసం కోసం కేటాయించామని అన్నారు. రూ. 300 కోట్లు మొదటి విడతలో నిర్వాసితులకు ఇస్తున్నామని చెప్పారు. ఏపీలో చాలా ఇబ్బందులు ఉన్నాయని సీఎం అన్నారు.

# సీషెల్స్‌కు మోడీ

**ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు**


**అత్యంత వృద్ధ తాబేలుతో ప్రధాని మోదీ భేటీ**

**194 ఏళ్ల 'జోనాథన్' నివసిస్తున్న బొటానికల్ గార్డెన్స్‌కు సందర్శన**

**పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కను నాటిన ప్రధాని**

**భారత్-సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన**





**న్యూఢిల్లీ,జూన్ 27ఆంధ్ర ప్రగతి**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన 'జోనాథన్' అనే తాబేలుతో ఆయన భేటీ అయ్యారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు. సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా**మిగతా 2లో...**

# స్మార్ట్ కిచెన్స్ పేరుతో రోడ్డున పడేసే కుట్ర

**85 వేల అక్కచెల్లెమ్మల జీవితాలతో చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారు: జగన్**

**మధ్యాహ్న భోజనం వండుతున్న వారి జీవితాలతో చంద్రబాబు ఆడుకుంటున్నారన్న జగన్**

**వారికి బకాయి పెట్టిన జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్**



**2లో.**

# సంక్షేమంతో పాటు... అభివృద్ధి ముఖ్యమే

## జనసేన నిర్మాణ సారధుల కార్యాచరణ సమావేశంలో పవన్

**కేవలం సంక్షేమంతో అభివృద్ధిని సాధించలేం**

**రోడ్లు, ఆస్పత్రులు, స్కూళ్లను అభివృద్ధి చేయాలి**

**కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదు**

**కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదే చేస్తున్నాం**

**కేవలం బటన్ నొక్కితే వైకాపా గతేమయ్యిందో చూశాం**

**అభివృద్ధిపై గ్రామస్థాయిలో జనసేన ఆధ్వర్యంలో చర్చ సాగాలి**

**వైకాపా కులరాజకీయాలతో భ్రష్టు పట్టించే యత్నం**

**11 సీట్లు వచ్చినా తిట్ల దండకం ఆపని వైకాపా నేతలు**




**అమరావతి,జూన్ 27(రిపబ్లిక్ న్యూస్)**
ఒక్క సంక్షేమ పథకాలే కాదు..అభివృద్ధి కూడా ముఖ్యమన్నది జనసేన విదానమని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల విషయంలో జనసేన పార్టీకి ఎలాంటి వ్యతిరేకత లేదని**మిగతా 2లో...**

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

**గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి : అమిత్ షా**

**రాబోయే రెండేళ్లలో దేశంలోని 500కు పైగా నగరాలకు సేవలు విస్తరించనున్నట్లు ప్రకటన**




**న్యూఢిల్లీ,జూన్ 27ఆంధ్ర ప్రగతి**
రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ **మిగతా 2లో...**

# హైదరాబాద్‌లో 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'

**హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ ప్రధాన రోడ్డుకు ట్రంప్ పేరు**

**పదవిలో ఉన్న అమెరికా అధ్యక్షుడికి ఈ తరహా గౌరవం చరిత్రలో ఇదే తొలిసారన్న ట్రంప్**

**అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అధికారికంగా బోర్డు ఆవిష్కరణ**

**అమెరికన్ దిగ్గజ సంస్థల కార్యాలయాలకు సమీపంలోనే ఈ కొత్త అవెన్యూ**

**ఇరు దేశాల బంధానికి ప్రతీకగా రోడ్డు పేరు మార్చామన్న డిప్యూటీ సీఎం భట్టి**






# ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

**ఆ చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పండి**

**తెలంగాణ హక్కలుకు భంగం వాటిల్లేలా రేవంత్ నిర్ణయాలు**

**మరోమారు విమర్శలు గుప్పించిన హరీష్ రావు**

**హైదరాబాద్,జూన్ 27ఆంధ్ర ప్రగతి**
:ఇటీవల కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలు ఏంటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో మూడు రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ **మిగతా 2లో...**

# అమరావతిలో వైసీపీ నేతలపై కోడిగుడ్లతో దాడి



**అమరావతికి వైకాపా నేతల రాకతో ఉద్రిక్తత**

**వారి పర్యటనను అడ్డుకుని తిప్పిపంపిన రైతులు**

**అమరావతిలో పర్యటించే అధికారం లేదని ఉద్ఘాటన**

**అప్పుడేమో మూడు రాజధానులు..ఇప్పుడేమో మావిగన్**

**వైకాపా నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్**

**పరస్పర దాడులతో పోలీసుల రంగప్రవేశం**

**అమరావతి,జూన్ 27ఆంధ్ర ప్రగతి**
అమరావతి ప్రాంతంలో వైసీపీ నేతల పర్యటన ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం పెనుమాక సందర్శనకు వచ్చిన వైసీపీ నేతల బృందాన్ని ఉండవల్లి వద్ద రాజధాని రైతులు అడ్డుకున్నారు. వాహనాలు ముందుకు**మిగతా 2లో...**

# సంక్షేమంతో పాటు...అభివృద్ధి ముఖ్యమే

మొదటిపేజీ తరువాయి

అన్నారు. నిజంగా నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వ సహాయం, ఉచిత పథకాలు అవసరమేనని ఆయన పేర్కొన్నారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే ప్రభుత్వాన్ని నడపడం సాధ్యం కాదని, ప్రజలు అభివృద్ధిని కూడా కోరుకుంటారని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల అభివృద్ధి కూడా చాలా ముఖ్యమని అన్నారు. దీనిపై గ్రామస్థాయిలోనే చర్చ సాగాలని పార్టీ నేతలకు పవన్ సూచించారు. కేవలం బటన్ నొక్కి నగదు బదిలీలు చేస్తే ప్రజలు ఎప్పటికీ ఓట్లు వేస్తారనే భావన సరికాదని అన్నారు... అలాంటి రాజకీయాలకు నిలువెత్తు ఉదాహరణ గత ప్రభుత్వం అని, సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కూడా సమానంగా ఉండాలని ఆయన చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పవన్ విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంతసేపు బటన్ నొక్కి డబ్బులు పంపించామని చెప్పడం కంటే, ప్రజలు ప్రయాణించే రోడ్లు ఎవరు వేశారు? దశాబ్దాలుగా నిర్మించని రహదారులు ఇప్పుడు ఎలా నిర్మితమయ్యాయి? అనే విషయాలను కూడా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.. ప్రజలకు సంక్షేమం ఎంత అవసరమో, నాణ్యమైన రహదారులు, ఆసుపత్రులు, ఇతర మౌలిక వసతులు కూడా అంతే అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తమ బాధ్యతగా అభివృద్ధిపై దృష్టి పెట్టకపోతే,




ఎన్ని ఉచిత పథకాలు అమలు చేసినా ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందరని పేర్కొన్నారు. వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడుతున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లాడిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించ నని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కులాలతో రాజకీయాలు చేయను, చేయబోనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తా. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారు.. అది సరికాదు. ఎన్ని ఏళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకున్నాం. కమిటలో ఉన్న వారికి విధివిధానాలు అందిస్తాం. సేకరించిన సమాచారాన్ని నా దృష్టికి తేవాలి. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని పవన్ సూచించారు. గాదె సాయికృష్ణ వివాదంపై పవన్ కల్యాణ్ స్పందించారు. కృష్ణలంకలో ఒక గొడవ జరిగితే క్రిమినల్‌కు కులాన్ని ఎలా అంటగడుతున్నారని ప్రశ్నించారు. తప్పు ఎవరు చేసినా.. ఏ కులం వారు చేసినా.. తప్పే కదా అని నిలదీశారు. కాపు అయితే ఒప్పు.. ఇంకొకరు అయితే తప్పు అవుతుందా అని ప్రశ్నించారు. తనకు పేపర్లు, ఛానళ్లు లేవని.. జనసైనికులే తన మీడియా అని వ్యాఖ్యానించారు. ఇలాంటి అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాలను సమానంగా చూడటమే సామాజిక న్యాయమని తెలిపారు. కుల రాజకీయం పొలిటికల్ విక్టరీ అవుతుందేమో గానీ.. సామాజిక విక్టరీ కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అధికారం ఎప్పుడూ జగన్ అండ్ కో చేతిలోనే ఉండాలా అని ప్రశ్నించారు. వైసీపీ వాళ్లను చూడాలి.. ప్రతి అంశంలోనూ కులాన్ని, మతాన్ని కూడా వాడతారని ఎద్దేవా చేశారు. వైసీపీలో పనిచేసిన నాయకులు మన వేదిక మీద ఉన్నారని ప్రస్తావించారు. వీరు దిగజారి మాట్లాడిన దాఖలాలు ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. వైసీపీలో ఇతర నేతలు నోరు తెరిస్తే అసభ్య వ్యాఖ్యలే చేస్తారని.. వ్యక్తిత్వ హననాలు చేస్తారని చెప్పుకొచ్చారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ మనిషి.. ఆయన విలువలతో మాట్లాడారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 18వేల మంది సాధక్‌లను కలవాలనేది తన భావన అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ప్రతి ఊరిలో బాధ్యతలు అప్పగించిన నాయకుడు.. అక్కడ 2వేల మంది ప్రజలకు తెలిసి ఉండాలని తెలిపారు. ఎమ్మెల్సీ నాగబాబును అరకుకు పంపించామని.. ఆయన జనాలతో మాట్లాడతారని.. ప్రకృతిని సంరక్షిస్తారని అన్నారు. పల్నాడుకు బాలినేని శ్రీనివాసరెడ్డి కరెక్టు అని భావించి.. ఆ బాధ్యత అప్పగించామని చెప్పారు.

# అమరావతిలో వైసీపీ నేతలపై కోడిగుడ్లతో దాడి

మొదటిపేజీ తరువాయి

వెళ్లకుండా రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'రాజధాని ద్రోహి జగన్, గో బ్యాక్' అంటూ రైతులు నినాదాలు చేశారు. వైసీపీ నేతలు ఏ మొహం పెట్టుకుని రాజధానికి వస్తారని ప్రశ్నించారు. మావిగన్ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి వైసీపీ నేతల పర్యటనకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. వైకాపా నేతలు గో బ్యాక్ అంటూ పెనుమాక, కృష్ణాయపాలెంలో రైతులు ర్యాలీ నిర్వహించారు. రాజధానిగా అమరావతిని అంగీకరించాకే పర్యటించాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో రైతుల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని ఆ ప్రాంత వాసులు ఆరోపించారు. ఇందులో భాగంగానే గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నాయకులతో ఆ పార్టీ.. రాజధాని పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసిందని విమర్శించారు. ఈ కమిటీ శనివారం రాజధాని ప్రాంతంలోని పెనుమాక పర్యటనకు రావడంతో రైతులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో ఉండవల్లి, పెనుమాక ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వైకాపా నేతలు ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి వద్దకు రాగానే రైతులంతా వెళ్లి అడ్డుగా నిల్చున్నారు. పేర్ని నాని, లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ తదితరులపై రైతుల తిరుగుబడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఐదేళ్ల పాటు కాలయాపన చేసి, అమరావతిని విధ్వంసం చేసిన వైకాపా నేతలకు రాజధాని గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు .. అధికారం పోయాక మావిగన్ అని గందరగోళం చేసే చర్యలు మానుకోవాలని హితవు పలికారు. రాజధానిగా అమరావతిని అంగీకరించిన తర్వాత మాత్రమే ఇక్కడ అడుగు పెట్టాలని స్పష్టం చేశారు. రైతులను తోసుకుంటూ వైకాపా నేతలు ముందుకువెళ్లేందుకు ప్రయత్నించగా.. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఓ దశలో రాళ్లు విసురుకున్నారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితి చక్కదిద్దారు. రైతులను, వైకాపా నేతలను చెరో వైపునకు పంపించారు. రైతులు వైకాపా నేతల వెంటపడటంతో పోలీసులు వారిని నిలువరించారు. వైకాపా నేతలు వెళ్లిపోవాలని.. లేకపోతే ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని చెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. రాళ్ల దాడిలో ఓ కానిస్టేబుల్ గాయాలైనట్లు సమాచారం. అమరావతిని రాజధానిగా అంగీకరించిన తర్వాతే పర్యటించాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. రైతులను తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు వైసీపీ నేతలు, కార్యకర్తలు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాజధాని రైతులు, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం ఇరువర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగాయి. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ గాయపడగా, ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా రాజధాని రైతులు మాట్లాడారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై వైసీపీ శ్రేణులే కోడిగుడ్లతో దాడి చేశాయని ఆరోపించారు. అలాగే వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉండవల్లి సెంటర్‌తో పాటు పెనుమాక, కృష్ణాయపాలెం ప్రాంతాల్లో కూడా రైతులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. అమరావతి రాజధాని అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని రైతన్నలు స్పష్టం చేశారు. మరోవైపు, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉన్నప్పటికీ, అమరావతి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది

# నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

మొదటిపేజీ తరువాయి

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చు. సుంకేశుల గ్యాప్ పనులను 1998లోనే ప్రారంభించాం. గత ప్రభుత్వాలు కూడా మాలాగే చేసుంటే పరిస్థితి మరోలా ఉండేది. మార్కాపురం జిల్లాలో పండ్ల తోటలు బాగా రావాలన్నారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం గొప్పది. మీరు ఇచ్చిన భూముల వల్ల నాలుగైదు జిల్లాలు బాగుపడతాయి. వెలిగొండ నీళ్లు వచ్చాక చుట్టుపక్కల భూముల విలువ పెరుగుతుంది. మాది ప్రజా ప్రభుత్వం.. అందరికీ లబ్ది చేకూరుస్తాం. కరవు జిల్లా పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని సీఎం తెలిపారు. మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ నేతలు దిట్ట. వైకాపా నేతలు కళ్లు ఆర్పకుండానే అబద్ధాలు చెబుతున్నారు. ఆ పార్టీ నేతలు ఇప్పుడు వితండవాదం చేస్తున్నారు. వెలిగొండ పేరుతో వైకాపా ప్రభుత్వం అనేక మోసాలు చేసింది. టన్నెల్-2లో బోరు ఇరుక్కు పోయినా ప్రాజెక్టును ప్రారంభించేశారని మండిపడ్డారు. నక్సలిజంపై పోరాటం చేశానని.. క్లైమోర్ బాంబులు పెడితే వేంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు. గత పాలకులు రూ.10 లక్షల కోట్లు అప్పులు పెట్టిపోయారని విమర్శించారు. 3,351 వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు రూ.300 కోట్లు జమ చేశామన్నారు. నిర్వాసితుల త్యాగం వృథా కాదని.. అందరికంటే మెరుగైన జీవితం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుపై ఈ టర్మ్‌లో రూ.3,900 కోట్ల వ్యయం అవుతోందన్నారు. 2027 నాటికి మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫేజ్-1, ఫేజ్-2 పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇడుపూరు, గోగులదిన్నె, తోకపల్లి తదితర పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. మార్కాపురానికి ప్రత్యేక జిల్లా ఇచ్చామని.. కలెక్టరేట్ కూడా పునరావాస కాలనీ పక్కనే వస్తుందని తెలిపారు. పునరావాస కాలనీ భవిష్యత్తులో ఆదర్శ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 23 లక్షల మందికి

తాగునీరు అందేలా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. 43.5 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ.120 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చామని.. రూ.98 కోట్లతో సుంకేసుల పనులను ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వెలిగొండ ఆలస్యమైందని విమర్శించారు. పదేళ్ల ముందే ప్రాజెక్టు పూర్తయి ఉంటే రైతుల జీవితాలు మారిపోయేవన్నారు. గొడ్డలి పార్టీ మోసాలు డిజిటల్ మోసాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు డ్రామాలు, మోసాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. డిజిటల్ అరెస్ట్ మోసాల తరహాలో వైసీపీ మోసాలు అంటూ దుయ్యబట్టారు. 2024లో కేటాయించిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదన్నారు. టన్నెల్-2లో యంత్రం చిక్కుకుపోయినా తొలగించకుండా ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టం జరగనివ్వమని.. బాధిత రైతులందరికీ న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో నాలుగు జిల్లాల అభివృద్ధి, భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామన్నారు. వెలిగొండ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించామని తెలిపారు. మార్కాపురం జిల్లాకు కరువు పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని.. ఈ ప్రాంతంలో హార్టికల్చర్‌కు పెద్దపీట వేస్తామన్నారు. మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. హార్టికల్చర్ అభివృద్ధికి రూ.1 లక్ష కోట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రూ.40 వేల కోట్లు ప్రభుత్వం, రూ.60 వేల కోట్లు ప్రైవేట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రామాయపట్నం పోర్టు, ఎయిర్‌పోర్ట్‌తో ఎగుమతులకు అవకాశముందని సీఎం అన్నారు. రోడ్లు, రైల్వే కనెక్టివిటీతో ప్రాంత అభివృద్ధి వేగవంతం చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తున్నామని.. మైక్రో ఇరిగేషన్‌కు మళ్లీ ప్రోత్సాహం అందిస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. హంద్రీ-నీవా పూర్తి చేసి చివరి ప్రాంతాలకు నీళ్లు అందించామని వెల్లడించారు. పోలవరం ఆలస్యం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందన్నారు. అమరావతిని నిలిపివేయడం రాష్ట్రానికి నష్టమన్నారు. 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధికి రాజధాని అత్యంత కీలకమన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు మారతాయని ధీమా వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామ న్నారు. కులం, మతం ఆధారంగా కాకుండా అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే మార్కాపురం అభివృద్ధి జరిగిందని చంద్రబాబు తెలిపారు. తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతులతో నీటి వృథాను అడ్డుకున్నామన్నారు. 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి ముగ్గురు ముఖ్యమంత్రులం జాతికి అంకితం చేశామని తెలిపారు. గంగా, కావేరి నదుల అనుసంధానం అవసరమన్నారు. దేశంలో విద్యుత్ గ్రిడ్ వ్యవస్థతో విద్యుత్ కొరత సమస్య తగ్గిందని చెప్పారు. సెల్‌ఫోన్ విప్లవం వల్ల ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. రైతుల్లో అభివృద్ధి దిశగా ఆలోచనా విధానం మారాలని సూచించారు. 2027 కల్లా పోలవరం పూర్తి చేస్తామని ప్రకటించారు. అక్కడి నుంచి నల్లమల సాగర్‌కు నీళ్లు తీసుకువస్తామన్నారు. అవసరమైతే నల్లమల సాగర్ నుంచి లిఫ్ట్ పెట్టి కావేరికి కూడా నీళ్లు ఇవ్వొచ్చన్నారు. దీని వలన ఐదు నదులు అనుసంధానం అవుతాయని.. నాలుగు రాష్ట్రాలు బాగుపడ తాయని చెప్పుకొచ్చారు. 'మార్కాపురం జిల్లా అభివృద్ధి చేసే బాధ్యత నాది. మీ కంటికి కనిపించే నాయకుల్ని చూడొద్దు.. నన్ను చూడండి, పార్టీని చూడండి , ఎన్డీయే కూటమిని చూడండి. మీ ఆమోదం లేకపోతే ఎవరినీ నేను ఆమోదించను. అందరూ ఆమోదించే వ్యక్తి దొరకడం కూడా కష్టమే. పోలవరం నిర్వాసితులు త్యాగం చేశారు. అందుకే ఒకే నియోజకవర్గానికి ఒక జిల్లా ఇచ్చాను. వెలిగొండ ప్రాజెక్టు రైతులు రాష్ట్రానికి ఆదర్శం' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

మొదటిపేజీ తరువాయి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురే కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడతామంటుంటే మన ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడైన తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఆర్డీఎస్ కు పక్కా నీటి కేటాయింపులపై ఏమైనా స్పష్టమైన హామీ వచ్చిందా అని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కాంప్రమైజ్ అయినా బీఆర్ఎస్ అస్సలు ఒప్పుకోదని స్పష్టం చేశారు. గత అరవై ఏళ్లలో కాంగ్రెస్ ఏడాదికి సగటున 4 టీఎంసీల చొప్పున అనుమతులు తెస్తే, బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున పర్మిషన్లు తెచ్చామని గుర్తుచేశారు. మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామని, ఇంకా 138 టీఎంసీల అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా 'బనకచర్ల' ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని, ఆ నిద్రను తట్టిలేపింది బీఆర్ఎస్సేనని చెప్పారు. పాలమూరు పేరిట సమ్మక్క సారక్క ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెడుతున్నారని, తాగేందుకు మంచి నీళ్లు లేక పాలమూరు తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని మేడిగడ్డ గేట్లను రిపేర్ చెయ్యడం చేతకాదు గానీ, తుంగభద్ర గేట్ల రిపేర్ కోసం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డికి హిట్లర్ స్ఫూర్తి అయితే, నీళ్ల విషయంలో రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి స్ఫూర్తి అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రి అయిన రేవంత్ రెడ్డి, తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావొద్దని హరీష్ రావు హితవు పలికారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ఆంధ్రప్రదేశ్ సుజలం, కర్ణాటక సుఫలం, తెలంగాణ నిష్ఫలంగా మారుతోందని, కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు ఒక్క చుక్క నీటి విషయంలో అన్యాయం జరిగినా కేసీఆర్, బీఆర్ఎస్ ఊరుకునే ప్రసక్తే లేదని తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

## స్మార్ట్ కిచెన్స్ పేరుతో రోడ్డున పడేసే కుట్ర

**అమరావతి,జూన్ 27ఆంధ్ర ప్రగతి**

గవర్నమెంటు స్కూళ్లలో మధ్యాహ్న భోజనం వండుతున్న దాదాపు 85 వేల మంది అక్కచెల్లెమ్మల జీవితాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. దాదాపు 20 ఏళ్లకు పైబడి పనిచేస్తున్నవారు, వీరిలో చాలామంది ఉన్నారని... ఇప్పుడు, స్మార్ట్ కిచెన్స్ పేరుతో తన పార్టీవారి పొట్టలు నింపుతూ, అక్కచెల్లెమ్మలను మాత్రం రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగా ఇప్పుడు వారికి ఇవ్వాల్సిన జీతాలు గత రెండు నెలలుగా బకాయిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.వేయి ఉండే జీతాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 3 వేల వరకు పెంచామని జగన్ తెలిపారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తామని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు స్మార్ట్ కిచెన్స్ పేరుతో వారిని తొలగించి వారి జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నారని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికుల తరఫున పోరాడుతామని, వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే బకాయిపెట్టిన వారి జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు వారి జీతాలను కూడా పెంచాలని అన్నారు.

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

మొదటిపేజీ తరువాయి

ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు.
గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ-వీలర్లు, ఆటో-రిక్షాలు, ఫోర్-వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్-సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## సీషెల్స్‌కు మోడీ

మొదటిపేజీ తరువాయి

. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు.
భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## హైదరాబాద్‌లో 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'

**హైదరాబాద్ జూన్ 27ఆంధ్ర ప్రగతి**

హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని యూఎస్ కాన్సులేట్ ప్రధాన రహదారికి తెలంగాణ ప్రభుత్వం 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేసింది. ఈ అసాధారణ గౌరవం పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్షం వ్యక్తం చేస్తూ భారతదేశానికి, తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో హైదరాబాద్‌లోని రోడ్డు ప్రారంభోత్సవ చిత్రాలను పంచుకుంటూ ట్రంప్ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "భారతదేశంలోని హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పాటైన 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'.. పదవిలో ఉన్న ఒక అమెరికా అధ్యక్షుడికి ఈ విధంగా గౌరవం దక్కడం చరిత్రలోనే ఇదే తొలిసారి. థాంక్యూ!" అని ఆయన పేర్కొన్నారు. గతంలో 'యూఎస్ కాన్సులేట్ రోడ్డు'గా పిలిచిన నానక్‌రామ్‌గూడ లోని ఈ రహదారి.. అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి ఆనుకుని ఉంటుంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి ప్రపంచ ప్రసిద్ధ అమెరికన్ ఐటీ దిగ్గజాల క్యాంపస్‌లు కూడా ఈ రోడ్డు పరిసరాల్లోనే ఉన్నాయి. అమెరికాకు స్వాతంత్ర్యం సిద్ధించి 250 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించిన 'ఫ్రీడమ్ 250' వేడుకల వేదికగా ఈ వారం ప్రారంభంలో నూతన నామకరణ ఫలకాన్ని అధికారికంగా ఆవిష్కరించారు. భారత్-అమెరికా దేశాల మధ్య ఉన్న దృఢమైన ద్వైపాక్షిక సంబంధాలకు, గ్లోబల్ టెక్ హబ్‌గా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ సాధిస్తున్న వృద్ధికి ఈ నిర్ణయం ఒక నిదర్శనమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. 2025 చివరలో జరిగిన యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్నర్‌షిప్ ఫోరమ్ సదస్సులోనే రేవంత్ రెడ్డి ఈ ప్రతిపాదనను ప్రకటించారు. కాగా, ఈ ప్రతిష్ఠాత్మక బోర్డు ఆవిష్కరణ కార్యక్రమంలో భారత పర్యటనలో ఉన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు స్వయంగా పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 27 జూన్ 2026

# ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 27:**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా పట్టణంలోని టేక్కె మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాముల వద్ద ఏర్పాటు చేసిన సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి చేపట్టే రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు, 24/7 సర్వేలెన్స్ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్న విషయాన్ని వారు సమగ్రంగా సమీక్షించారు. అదే విధంగా గోదాము పరిసరాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేసి తనిఖీలను అధికారికంగా నమోదు చేశారు. ఈవీఎంల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. భద్రతా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగించాలని, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తాసిల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మనోహర్ కలెక్టర్ వెంట వున్నారు. అలాగే రాజకీయ పార్టీల తరపున ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి సయ్యద్ రియాజ్ భాష, టిడిపి పార్టీ ప్రతినిధి శివరామిరెడ్డి, వైయస్సార్సీపి పార్టీ ప్రతినిధి సాయిరాం రెడ్డి, బిజెపి పార్టీ ప్రతినిధి కె.చంద్రశేఖర్, బిజెపి పార్టీ ప్రతినిధి నరసింహా, జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్ కుమార్ హాజరై పర్యవేక్షణలో పాల్గొన్నారు.

# మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి.

..డిఆర్‌డిఏ పిడి శ్రీధర్ రెడ్డి.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 27:**
మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడి వ్యాపారవేత్తలుగా ఎదగాలని డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నంద్యాల నందు నిర్వహించిన 'వ్యాపార అభివృద్ధి శిక్షణా కార్యక్రమం' ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఆర్డిఏ పిడి శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రభుత్వం కల్పిస్తున్న ముద్ర, పీ ఎం ఈ జి పి, పి ఎమ్ ఎఫ్ ఎమ్ ఈ వంటి పథకాల ద్వారా మహిళలు సూక్ష్మ, చిన్న పరిశ్రమలు స్థాపించుకోవాలన్నారు. తద్వారా కుటుంబానికి ఆసరాగా నిలవడమే కాకుండా, మరో పది మందికి ఉపాధి కల్పించి నిరుద్యోగ సమస్య నివారణకు తోడ్పడాలి" అని సూచించారు. బ్యాంక్ రుణాలను సక్రమంగా వినియోగించుకొని వ్యాపారంలో నిలదొక్కుకోవాలని తిరిగి రుణాలు చెల్లించి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని అభ్యర్థులకు సూచించారు.కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీమతి అరుణ కుమారి, శిక్షణా సమన్వయకర్తలు శ్రీ శివ నారాయణ, శ్రీ రమేష్, సంస్థ సిబ్బంది మరియు శిక్షణార్థులు పాల్గొన్నారు.

# మా అడుగుల చప్పుడుకు నీ.. గుండె ఆగిపోతుంది జాగ్రత్త.

-ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ ఇసాక్ బాష.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 28:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి మాటల మంటలు రేగుతున్నాయి! వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై నంద్యాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిప్పులు చెరుగుతున్నాయి. పంతం నానాజీకి నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్ బాష స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. "జగనన్న ఆదేశం ఇస్తే... మా అడుగుల చప్పుడుకే నీ గుండె ఆగిపోతుంది.. ఖబడ్దార్!" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విమర్శలు సహజం... కానీ విజ్ఞత మరచి, కోట్లాది మంది అభిమానించే ఒక ప్రజా నాయకుడిపై నోరుపారేసుకుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని నంద్యాల సాక్షిగా వైసీపీ నేతలు హెచ్చరించారు. జగనన్నను ఒక్క మాట అన్నా.. సహించే




ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు! కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ.. జగన్ మోహన్ రెడ్డిపై చేసిన అసందర్భ, అనుచిత వ్యాఖ్యల పట్ల నంద్యాల లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల గుండెల్లో ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడ్డాయి! ఖబడ్దార్ నానాజీ అంటూ ఎమ్మెల్సీ ఇసాక్ బాష చేసిన హెచ్చరికలతో నంద్యాల రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. నాయకుడిపై ఉన్న గుండె నిండా అభిమానంతో, వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు... పంతం నానాజీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. అక్కడ ఎస్ఐ కృష్ణారెడ్డికి నానాజీ అనుచిత వ్యాఖ్యలపై అధికారికంగా ఫిర్యాదు పత్రాలను అందజేశారు. చట్టం ముందు ఎవరైనా ఒకటేనని, జగనన్నపై విషం చిమ్మితే ఊరుకునేది లేదని ఖరాఖండిగా చెప్పారు.కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ శశికళ రెడ్డి, వైసిపి రాష్ట్ర స్పోక్ పర్సన్ రవికుమార్,స్టేట్ ఎస్టి సెల్ సెక్రటరీ ఆంజనేయులు, రాష్ట్ర ఎస్టి సెల్ ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, వైసిపి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామ సుబ్బయ్య, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైసీపీ జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, జిల్లా వైసీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ,వైసీపీ జిల్లా సెక్రెటరీ దేవనగర్ భాష, వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టీవి రమణ వైసిపి అసెంబ్లీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, వైసిపి నంద్యాల అసెంబ్లీ ఎస్టి సెల్ అధ్యక్షుడు రామచంద్రుడు, వైసిపి నాయకులు సాయిరాం రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు చింత శ్రీనివాసులు, మేస చంద్ర శేఖర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

# యూరియా, డీఏపీ ఎరువులతో లింక్ ప్రొడక్టులు విక్రయించరాదు.

-జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 28:**
నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో ఈరోజు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎరువుల తయారీ సంస్థల అధికారులు, హ్యాండ్లింగ్ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎరువుల కంపెనీలు యూరియా మరియు డీఏపీ ఎరువులతో ఎటువంటి లింక్ ప్రొడక్టులను జతచేసి విక్రయించరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే రేక్ పాయింట్ నుంచి ఎరువుల డీలర్లకు సరఫరా చేసే సమయంలో తప్పనిసరిగా జీపీఎస్ ట్రాకింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు..అదేవిధంగా, డీలర్లు గరిష్ట చిల్లర ధర (ఎంఆర్పీ)కు మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా ఎరువుల సరఫరా జరగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, డీలర్లు ఎరువులను అవసరమైన ప్రాంతాలకు మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ ఫర్టిలైజర్ కంపెనీల సేల్స్ అధికారులు, హ్యాండ్లింగ్ ఆపరేటర్లు, నంద్యాల వ్యవసాయ అధికారి ప్రసాదరావు, మార్క్‌ఫెడ్ అధికారి హరినాథ్ రెడ్డి ,సాంకేతిక వ్యవసాయ అధికారి కళ్యాణ్ కుమార్, ఏఈఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలి

..మేథో యాప్ రద్దు చేసి పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులు అందించాలి.

..ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఇన్చార్జి కే భాస్కర్ డిమాండ్.

**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె జూన్ 27:**
బనగానపల్లె సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఇన్చార్జ్ కె భాస్కర్ జిల్లా అధ్యక్షులు. ఏ.సుబ్బారెడ్డి మాట్లాడుతూ పండిన పంటలకు గిట్టుబాటు ధరల లేక అరకొర బతుకులతో బతుకు ఈడుస్తున్న రైతులపై పురుగు ఎరువు మందులు ధరలు పెరగడం తో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగాఉంది పెట్రోల్ డీజిల్ పెంచడం వల్ల రైతు వ్యవసాయ ఖర్చులు పెరిగి వ్యవసాయమే చేయడానికి భయపడి భయపడి వ్యవసాయాన్ని వదులుకునే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడుగా ఏపీ ఐఐఎం యాప్ తో రైతులు తీవ్రంగా ఇబ్బంది. పడుతున్నారు కౌలు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది పెంచిన




ఎరువు పురుగు మందుల ధరలు డీఎల్ పెట్రోల్ ధరలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా కౌలు రైతులకు ఆర్.బి.ఐ నిబంధనల ప్రకారం ఎలాంటి హామీ లేకుండా రెండు లక్షల వరకు పంట రుణాలు ఇచ్చి కౌలు రైతులను ఆదుకోవాలి.

ప్రభుత్వం తెచ్చిన ఎరువుల యాప్ వల్ల ఎరువులు తీసుకునే పరిస్థితులు ఉండడం వల్ల కౌలు రైతులకు ఇబ్బంది కలగడమే కాకుండా సకాలంలో ఎరువులు వేసుకునే పరిస్థితి ఉండదు కాబట్టి తక్షణమే యాప్ ను రద్దు చేయాలి. పంట ఇన్పుట్ సబ్సిడీ. ఇనాం భూములకు ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న సన్న చిన్నకారు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తా ఉన్నాం

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలపై సమరభేరి మోగిస్తూ జూన్ 30న విజయవాడ ధర్నా చౌక్ లోజరిగే ధర్నాకు రైతులు స్వచ్ఛందంగా తరలి రావాలని పిలుపునిచ్చారు

రైతు లోకమా మేలుకో నీ హక్కులకై పోరాడు పాలకుల కళ్ళు తెరిపించడానికి మన హక్కులను సాధించుకోవడానికి విజయవంతం చేద్దాం

కార్యక్రమంలో సిపిఐ బనగానపల్లె మండల కార్యదర్శి కామ్రేడ్ శివయ్య రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు పి బాల నరసింహుడు పాల్గొన్నారు.

# కడిమెట్ల గ్రామంలో మంగళవారం నుండి ధార్మిక కార్యక్రమాలు.

-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి.తి.దే.





**ఆంధ్ర ప్రగతి ఎమ్మిగనూరు జూన్ 27:**తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మండలం, కడిమెట్ల గ్రామంలోని శివాలయం నందు ఈ నెల 30 వ తేదీ నుండి జూలై నెల 4 వ తేదీ వరకు ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను కడిమెట్ల గ్రామంలోని శివాలయం నందు స్థానిక భక్త సమాజంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం నుండి గురువారం వరకు డమాం జగదీశ్ చే ధార్మిక ప్రవచనాలు, శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు, ప్రతిరోజు స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు కడిమెట్ల ఈరన్న రావు, వేదపండితులు కె. శివమణి, కె. శంకరణి, కె. దినేశ్, భజన మండలి సభ్యులు కంసాలి మోహన్, కె. భూషనరావు, బోయ శంకరప్ప, బోయ కేశన్న, లక్ష్మీకాంత్,బోయ నరసప్ప, బోయ నాయుడు, బి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష మినహాయింపు చట్ట సవరణ చేయాలి.

-కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎం మధుసూదన్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 27:**
ఈరోజు రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎం మధుసూదన్ రెడ్డి(ఆప్టా కర్నూలు జిల్లా అధ్యక్షుడు)మరియు సెక్రటరీ జనరల్ భాస్కర్ (బి టి ఎ)నాయకత్వం లో ప్రజా ప్రతినిధులకు ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు చట్ట సవరణ ను చేయాలి.చట్ట సవరణ జరిగే లోగా టీచర్ల కొరకు ప్రత్యేక టెట్ పరీక్ష నిర్వహించాలని అందరికీ సమానంగా ఉత్తీర్ణత మార్కులు 40 శాతం గా నిర్ణయం తీసుకోవాలని అనే డిమాండ్ లతో కూడిన మెమోరాండం ను కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాడు నాగరాజు కి, కోడుమూరు నియోజకవర్గం శాసన సభ్యులు శ్రీ బొగ్గుల దస్తగిరి కి మరియు



పాణ్యం నియోజకవర్గం శాసన సభ్యురాలు శ్రీమతి గౌరు చరిత వెంకట రెడ్డి కి సమర్పించటం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ ప్రజా ప్రతినిధులు ఇన్ సర్వీస్ టీచర్ల టెట్ పరీక్ష సమస్య ను అర్థం చేసుకొని సానుకూలశీగా స్పందించారు. లోక్ సభలో చట్ట సవరణ కొరకు ప్రయత్నం చేస్తాను అని పార్లమెంట్ సభ్యులు హామీ ఇచ్చారు. శాసన సభ తీర్మానం ప్రవేశ పెట్టి తద్వారా కేంద్ర ప్రభుత్వం నకు చట్ట సవరణ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని శాసన సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు జనార్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఎ పి టి ఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, హేమంత్,వెంకట శేషయ్య ఎ పి టి ఎఫ్ 1938,ఖాసింజి ఎ పి టి ఎఫ్ 257 , యు టి ఎఫ్ నాయకులు బషీర్,హుస్సేన్ ప్రధానోపాధ్యాయ సంఘము నాయకులు పాల్గొన్నారు

# బ్రతికున్న వ్యక్తిని మృతుడిగా నమోదు..

## క్యాన్సర్ చికిత్సకు ఆటంకం.

### ..డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డికి బాధితుడి వినతి.



**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 27:** ప్రభుత్వ రికార్డుల్లో జరిగిన పొరపాటు కారణంగా బ్రతికున్న వ్యక్తిని మృతుడిగా నమోదు చేయడంతో క్యాన్సర్ చికిత్స నిలిచిపోయిన ఘటన డోన్‌లో వెలుగులోకి వచ్చింది. డోన్ పట్టణంలోని కొండపేటకు చెందిన బెస్త శ్రీనివాసులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ కర్నూలులోని ఒమేగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. అయితే ఆరోగ్య మిత్ర (ఆరోగ్యశ్రీ) పోర్టల్‌లో ఆయనను పొరపాటున మృతుడిగా నమోదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. దీంతో చికిత్సను కొనసాగించలేమంటూ ఆస్పత్రి వర్గాలు నిలిపివేశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమంలో బాధితుడు వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య మిత్ర రికార్డుల్లో జరిగిన పొరపాటును వెంటనే సరిదిద్ది, తన క్యాన్సర్ చికిత్స నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం.

# అహోబిలం టోల్గేట్ వేలంపాటలో హై టెన్షన్..!

**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ/ అహోబిలం జూన్ 27:**
ఆళ్లగడ్డ మండల పరిధిలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం టోల్గేట్ వేలం పాటలు హై టెన్షన్ తో కొనసాగాయి. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి అనుచరులు వేలంపాటలో పాల్గొంటున్నారని తెలుసుకొని వేలంపాటలో పాల్గొనకుండా ఆలస్యంగా వెళ్లేలా పోలీసులు వారి వాహనాలను ఆపడంతో ఏవి సుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ కారణంతో తమ అనుచరుల వాహనాన్ని ఆపుతున్నారని పోలీసు వారిని నిలదీశారు. అయితే అహోబిలం చేరుకునీ టోల్గేట్ వేలంపాటలో పాల్గొనేందుకు వెళ్లిన ఏవి సుబ్బారెడ్డి అనుచరులు శ్రీకాంత్ రెడ్డి శివ నాగిరెడ్డి మౌలి ఈశ్వర్ రెడ్డి లకు అహోబిలం పంచాయతీ సెక్రటరీ నిబంధనల మేరకు అహోబిలం గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రజలు మాత్రమే వేలంపాటలో పాల్గొనవచ్చని ఇతరులకు ప్రవేశం లేదంటూ తెలపడంతో వేలంపాటకు వెళ్లిన పలువురు అయోమయానికి





గురయ్యారు. తమకు తెలిపిన సమాచారం మేరకు ఎక్కడా స్థానికులకే అవకాశం ఉంటుందన్న అంశం లేనందున తాము వేలం పాటలో పాల్గొనేందుకు వచ్చామని అయితే ఇక్కడ స్థానిక గ్రామపంచాయతీ అధికారులు సిబ్బంది స్థానిక నేతల మెప్పు పొందేందుకు కొంతమంది గుత్తేదారులకు లబ్ధి పొందేందుకు నిబంధనలను సడలించినట్లు వారు ఆరోపించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఇలాంటి వేలంపాటల ద్వారానే నిధులు సమకూరుతాయని అయితే కొంతమంది గుత్తేదారులతో కుమ్మక్కైన అధికారులు వేలంపాటలో స్థానికులకే అవకాశం అంటూ ఇతరులకు అవకాశం కల్పించకపోవడం ప్రభుత్వ రాబడి కి గండి కొట్టినట్లేనని అన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు ఈ వేలం పాట జరిగిన తీరును పరిశీలించి ప్రస్తుతం జరిగిన వేలంపాటలను రద్దుచేసి తిరిగి టోల్గేట్ వేలంపాటలను అందరికీ తెలిసేలా ప్రచారం చేసి నిర్వహించాలని వారు మీడియా ముఖంగా డిమాండ్ చేశారు.

# ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి.

### ..పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

### ..జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 27:**
జిల్లాలో జూన్ 28 నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.
శనివారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీని జెండా ఊపి జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ...పోలియో వంటి ప్రమాదకరమైన వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో జూన్ 28, 29, 30 తేదీలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మూడు దశల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 28న జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఏదైనా కారణంతో పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులను గుర్తించి, జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని వివరించారు. జిల్లాలో మొత్తం 3,52,164 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని, వారందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 1,630 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.
తల్లిదండ్రులందరూ జూన్ 28న తమ సమీపంలోని పల్స్ పోలియో బూత్‌కు ఐదేళ్లలోపు పిల్లలను తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, అందరి సహకారంతో జిల్లాను పూర్తిస్థాయి పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.
కలెక్టరేట్ కార్యాలయం నుంచి ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు భారీ పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ జాయింట్ కలెక్టర్, అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఎంహెచ్వో డాక్టర్ భాస్కర్, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్ఏ గడువులోగా అర్జీలు పరిష్కారం కావాలి.

### ..జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 27:** ప్రజా అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పిజిఆర్ఎస్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యలను నాణ్యతగా పరిష్కరించేందుకు పిజిఆర్ఎస్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, పిజిఆర్ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయి పర్యవేక్షణ చేయడం జరుగుతోందని అందుకు ప్రజా అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా సంబంధిత అధికారితో మాట్లాడి నాణ్యతతో ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పిజిఆర్ఎస్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 66,536 ప్రజా అర్జీలు స్వీకరించడం జరిగిందని, వాటిలో 61,710 దరఖాస్తులు నాణ్యతతో పరిష్కరించాం అన్నారు. అందులో రీఓపెన్ అయిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి ఉంచి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెన్ వెళ్లిన సంబంధిత అధికారులను కలెక్టర్ నేరుగా ఫోన్ చేసి అందుకు గల కారణాలు అడిగి తెలుసుకొని త్వరితగతిన సదరు అర్జీలను పరిష్కరించాలన్నారు. అంతకుముందు పిజిఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కార స్థాయి, నాణ్యత, ఆడిట్, ప్రీ ఆడిట్ అర్జీదారుల సంతృప్తి స్థాయి పట్ల పూర్తి స్థాయిలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

# సామాజిక ఆరోగ్యం, యువత సంక్షేమంపై అవగాహన కార్యక్రమం.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 27:**
పెద్దపాడు గ్రామంలో పీస్ సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సహకారంతో కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్యం, యువత సంక్షేమంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెండు రాష్ట్రాల రిసోర్స్ పర్సన్ ఎవి రమణయ్య కార్యక్రమాన్ని విదేశించి మాట్లాడారు అందులో భాగంగా ప్రస్తుత కాలంలో సీతనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఈ వ్యాధుల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు మహిళలు ఆర్థికంగా నిలబడి కుటుంబానికి అండగా ఉండాలని అందుకు కావలసిన నైపుణ్యాలను ప్రభుత్వం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు నేటి యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అలాంటి వారి విషయంలో తల్లిదండ్రులు చాలా బాధ్యత కలిగి ఉండాలని అన్నారు. మాదకద్రవ్యాల వాడకం ద్వారా యువత చెడు మార్గంలో నడిచి సమాజ అభివృద్ధికి నిరోధమవుతారని అన్నారు వారి జీవితం పాడు చేసుకోవడంతోపాటు కుటుంబ వ్యవస్థలో చాలా ఇబ్బందికర పరిస్తితులు ఎదుర్కోవాల్సింది వస్తుందన్నారు. ప్రస్తుతం వాతావరణం మారినందువల్ల రీజినల్ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రతిరోజు మంచినీటిని కాచి వడపోసుకుని తాగాలని అన్నారు రోగాలు వచ్చిన తర్వాత నయం చేసుకోవడం కంటే రాకుండా చేసుకోవడం చాలా ఉత్తమము అన్నారు ఈ




కార్యక్రమంలో గ్రామ నాయకులు లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజల యొక్క ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు ప్రస్తుతం తమ గ్రామంలోని యువత మంచి మార్గంలో పైనుంచి ఉన్నత చదువులు చదువుతున్నారని వారికి జీవనోపాధి విషయంలో ప్రభుత్వము అత్యంత సంస్థలు సహకారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పి సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పేరపోగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత చెడు మార్గంలో నడవకుండా ఉండాలంటే తల్లిదండ్రులు వారితో స్నేహభావంతో ఉండాలని ఎప్పటికప్పుడు వారిని గమనిస్తూ వారి అవసరాలను తగినట్టుగా వారితో ప్రవర్తించాలని తమ పిల్లలను దేశంలో అన్ని వర్గాలలో అభివృద్ధి పదంగా నడిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు. పేరపోగు జెఫ్రి,గని గౌతమ్ కుమార్ రెడ్డి,బి. రిషికేష్ నాయుడు,
ఎండి. తన్వీర్ అహ్మద్ మాట్లాడుతూ తమ కళాశాల ద్వారా సామాజిక సేవ చేయాలన్నటువంటి ఒక సబ్జెక్ట్ తీసుకొని పెద్దపాడు గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించామని ప్రతి ఒక్కరూ కుటుంబంలో ఆరోగ్య సూత్రాలు పాటించి క్షేమముకంగా క్షేమంగా ఉండాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గ్రామములోని వివిధ సంఘాల సభ్యులు యువత పాల్గొన్నారు.

# సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలి.

### ..ఓటరు జాబితా డిజిటైజేషన్ ప్రక్రియను 10 రోజుల్లోపు పూర్తి చేయాలి.

### ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 27:**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారం ల డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు.
శనివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశం పై కలెక్టర్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారం ల పంపిణీ ప్రక్రియ 88 శాతం జరిగిందని, దీంతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియను కూడా 10 రోజుల్లోపు పూర్తి చేయాలని ఈ ఆర్వో, ఏ ఈ ఆర్వో లను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసే అంశం పై దృష్టి సారించాలన్నారు. బిఎల్ఓ లు డిజిటైజేషన్ ప్రక్రియను ప్రతి రోజూ 10 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు..ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యాన్ని సహించేది లేదని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఫారాల పంపిణీ లక్ష్యాన్ని దాదాపు పూర్తి చేసినప్పటికీ, డిజిటైజేషన్ ప్రక్రియ పురోగతి మాత్రం ఆశించిన స్థాయిలో లేదన్నారు. మద్దికెర, గూడూరు మండలాల్లో కొంత మెరుగైన పురోగతి కనిపిస్తున్నప్పటికీ, అన్ని మండలాలు అదే స్థాయిలో పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా డిజిటైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించడంతో పాటు ఎన్రోల్మెంట్ ఫారాలను తప్పనిసరిగా అందజేసి, వాళ్లకు అర్థమయ్యేలా వివరించి ఫారాలను పూరించడంలో సహకరించాలన్నారు..ప్రతి మండలంలో అదనపు ఏ ఈ ఆర్ వో లను నియమించామని, వీరికి పోలింగ్ స్టేషన్లు కేటాయించడం జరిగిందని, వీరు కూడా సర్ ప్రక్రియను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్లు, అదనపు ఏ ఈ ఆర్ వోలు తమ పరిధిలోని బీఎల్ఓలకు నిరంతరం



మార్గనిర్దేశం చేస్తూ, ఈ ప్రక్రియను రోజువారీగా పర్యవేక్షించాలన్నారు. ఈ అంశంపై ప్రతి రోజు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ డిజిటలైజేషన్ ప ప్రక్రియ పూర్తి చేయడానికి కేవలం 18 రోజులు మాత్రమే ఉన్నాయని, అందులో కూడా చివరి 4-5 రోజులు అనామలీస్ కరెక్షన్ కోసం ఉంచాలన్నారు. 10 రోజుల్లో ప్రతి బిఎల్ఓ (దీూా) డిజిటలైజేషన్ ప్రక్రియ 10 శాతం చేస్తేనే నిర్దేశించిన లక్ష్యాలను సాధించగలిగామన్నారు. బీఎల్ఓలు ముందస్తు ప్రణాళికతో సమన్వయంగా పనిచేస్తే, ఒక్క రోజులోనే సుమారు 15 నుంచి 20 శాతం వరకు డిజిటైజేషన్ పూర్తి చేయవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జేసీ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో మండలాల వారీగా పురోగతిపై లోతుగా సమీక్షించారు.
టెలి కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లు,ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 29వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం.

### ..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూన్ 27:** ఈ నెల 29వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటల నుండి కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు , మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా



ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

## బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా షేక్ చాందిని నియామకం.

నియామక పత్రాన్ని అందజేసిన బిజెపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 27:**
నంద్యాల జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో షేక్ చాందినీని భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చా నంద్యాల జిల్లా అధ్యక్షురాలిగా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఆమెకు అందజేసి, వెంటనే బాధ్యతలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసి మైనారిటీ వర్గాల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువస్తూ ప్రజల్లో బీజేపీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. నూతన బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి షేక్ చాందినీ కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మైనారిటీ మోర్చా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల మెరుగుదలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

**..ఉత్తమ ఫలితాలను సాధించిన పాఠశాలల విజయాలను ఆదర్శంగా తీసుకోవాలి.**

**..జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 27:**
రానున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లాకు మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం జిల్లా మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలు, తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి ఫలితాల ఆధారంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలు, తక్కువ పురోగతి నమోదైన పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో 26 పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించగా, 46 పాఠశాలలు ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేదని పేర్కొన్నారు.
ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలల విజయానికి దోహదపడిన అంశాలను విశ్లేషించడంతో పాటు, తక్కువ ఉత్తీర్ణతకు దారితీసిన కారణాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆ విశ్లేషణ ఆధారంగా ప్రతి పాఠశాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.
విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన విద్యా సహాయం, మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందించాలని సూచించారు. ప్రతి



ప్రధానోపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేసి రానున్న విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయిలో మరింత మెరుగైన పదో తరగతి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# రైతులకు నకిలీ విత్తనాలు ఇస్తే సహించేది లేదు

ఆర్ ఎస్ పి కమ్యూనిస్టు పార్టీ




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 27:** నంద్యాల జిల్లాలోని గ్రామాల్లోని నంద్యాల పట్టణంలోని నకిలీ విత్తనములో వడ్లు పత్తి గింజలు మొక్కజొన్న మిరప సిడుజొన్న మొదలగు రైతులకు అందజేసి విత్తనములు నాణ్యతగా ఉండాలని ఏమి పొరపాటు జరిగిన సహించేది లేదని ఆర్ఎస్పి నంద్యాల జిల్లా కార్యదర్శి అప్ప పోగు సుబ్బరాయుడు ఆవేదన తెం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నంద్యాల పట్టణంలో ఎన్నోసార్లు రైతులు మోసపోతున్నారని, వడ్ల రూపంలో గాని లేక మిరప విత్తనాలను గాని పత్తి గింజల్లో గాని సంవత్సరానికి ఏదో ఒక చోట నంద్యాల జిల్లాలో 200 నుండి 300 వరకు నంద్యాల జిల్లాలో నకిలీ విత్తనంలో మోసపోతున్నారు అని వారు హెచ్చరించారు. వాటిని అరికట్టే వారు అగ్రికల్చర్ నంద్యాల జిల్లా ఏడి తక్షణమే చొరవ తీసుకొని నకిలీ విత్తనములు లేకుండా చేసే బాధ్యత అగ్రికల్చర్ ఏవో జిల్లాలో ఉన్న యోవో తో మాట్లాడి ఏ మండలంలో అయినా నకిలీ విత్తనములు నీళ్ల మందులు అడుగు మందులు విపరీతంగా అమ్మకుండా చేయాలని ఆర్ఎస్పి రెబలేషన్ పార్టీ ఆర్ఎస్పి కమ్యూనిస్టు పార్టీ తెలపడం జరుగుతుంది. ఎక్కడైనా రైతులకు విత్తనములు పొరపాట్లు జరిగిన లేదా నకిలీ నీల మందులు విపరీతంగా అమ్ముతున్నారు వాటిని కూడా అరికట్టాలి. అదేవిధంగా అడుగు మందులు విపరీతంగా రేట్లు పెంచి అగ్రికల్చర్ మండలంలో ఉన్న రాజకీయ నాయకులకు బానిసయ్యి పక్కదారి పట్టించకుండా వాటిని అరికట్టాలని లేని పక్షంలో అగ్రికల్చర్ నంద్యాల జిల్లా అధికారి ఏడి ఆఫీసును ముట్టడిస్తామని ఆర్ఎస్పీ రేవ్యులేషన్స్ సోషలిస్టు పార్టీ తెలియజేయడం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ భాష కరీం భాష మౌలా షేక్ ఖాసిం పాల్గొనడం జరిగింది.


# ప్రభుత్వ భవనాల్లోనే మద్యం పార్టీలా..?

**....ప్రజా ఆస్తుల దుర్వినియోగంపై ఆగ్రహం.**

**..నూనెపల్లిలో ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో మద్యం విందు కలకలం.**

**..బాధ్యత ఎవరిది..?**

**అధికారుల వివరణతో కొత్త ప్రశ్నలు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 27:**
ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయా..? నంద్యాల నూనెపల్లిలో చోటుచేసుకున్న ఘటన ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీసింది. జిల్లా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్ కార్యాలయాల సమీపంలోని నూతన మండల విద్యాధికారి కార్యాలయ భవనంలో కొందరు వ్యక్తులు మద్యం సేవిస్తూ బిర్యానీతో విందు చేసుకున్న ఘటన వెలుగులోకి రావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రజల సేవకే పరిమితం కావాలి. కానీ అలాంటి ప్రదేశాల్లో మద్యం సీసాలు, ఆహార పొట్లాలు కనిపించడం అధికారుల పర్యవేక్షణపై అనుమానాలకు తావిస్తోంది. రాత్రి వేళల్లో ప్రభుత్వ ఆస్తుల భద్రత ఎలా ఉంది..? ఎవరు పర్యవేక్షిస్తున్నారు..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.
ఘటన సమయంలో అక్కడ ఉన్న కొందరు వ్యక్తులు స్థానిక రాజకీయ నాయకులతో సంబంధాలు ఉన్నట్లు చెప్పినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారంలో రాజకీయ అండ ఉందా..? లేక భద్రతా లోపమా..? అన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి.
ఈ ఘటనపై వివరణ ఇచ్చిన విద్యాశాఖ అధికారులు, నూతన మండల విద్యాధికారి కార్యాలయం ఇంకా ప్రారంభం కాలేదని, భవనం అధికారికంగా తమ శాఖ ఆధీనంలోకి రాలేదని తెలిపారు. అయితే భవనం ఇంకా హ్యాండోవర్ కాకపోతే దాని భద్రత బాధ్యత ఎవరిది..? ఎవరూ పర్యవేక్షించకపోతే ఇలాంటి ఘటనలు మరెన్ని చోటుచేసుకుంటాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆస్తులను కొందరు వ్యక్తులు తమ ఇష్టానుసారం వినియోగిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులెవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా అధికారులు అప్రమత్తమై ప్రభుత్వ భవనాల దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది..!!

# ప్రజల్లో ప్రశ్నించేతత్వం చచ్చిపోయిందా?

**జూన్ 27 ఆంధ్ర ప్రగతి**
దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు. మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కుల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ధి కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న. వియజవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో ధృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో



తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన
కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళ్లు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.